సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం ׀ 16 ׀ నవంబర్ ׀ 2024



గండిలో ముగిసిన పవిత్రోత్సవాలు

చక్రాయపేట మండలం గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. -10లో



సీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు

చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి రాయలసీమకు ద్రోహం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్ర నాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. -10లో

గరిష్టం/కనిష్టం
31.0/23.9

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 23.9 – 31.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

14న జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 14న (శనివారం) జాతీయలోక్ అదాలత్ నిర్వహించనున్నారు. మరింత సమాచారం కోసం 08562– 258622, 244622, ఈ మెయిల్ అడ్రస్: కడప.డికోర్ట్స్.జిఓవి.ఇన్, డిఎల్ఎస్ఎకెడిపిఅట్‌ది డేటాఫ్ జిమెయిల్ డాట్ కామ్ లలో సంప్రదించాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి జి.శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలియజేశారు.

18న జాబ్‌మేళా

జమ్మలమడుగు: పట్టణంలో ఈ నెల 18న న్యాక్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు న్యాక్ అధికారి వినీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రొద్దుటూరు రహదారిలోని మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న తమ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. నిరుద్యోగులు ఉదయం 10 గంటలకు అక్కడికి చేరుకోవాలన్నారు. 18–30 ఏళ్ల మధ్య ఉన్న పీజీ, డిగ్రీ, ఇంటర్మీడియెట్, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని వివరించారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పాకా సురేష్



కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పాకా సురేష్ కుమార్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. పాకా సురేష్‌కుమార్ ప్రస్తుతం కడప నగర పాలక సంస్థలో 47వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్నారు.

ముగిసిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానం వేదికగా ఈ నెల 10 నుంచి నిర్వహించిన అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ శుక్రవారం ముగిసింది. ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికల ప్రక్రియకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన అభ్యర్థులు హాజరై ఫిజికల్, మెడికల్ టెస్ట్‌లలో పాల్గొన్నారు. కాగా ఎంపికల ప్రక్రియ సజావుగా సాగేందుకు జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం అందించింది. మొత్తం మీద ఎలాంటి ఆటంకాలు, ఘటనలు లేకుండా ప్రశాంతంగా ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ముగియడం విశేషం.

30లోగా దరఖాస్తు చేసుకోవాలి

రాయచోటి (జగదాంబసెంటర్): 2024–25 విద్యా సంవత్సరానికి పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం అర్హులైన విద్యార్థులు నూతన, రెన్యూవల్ రిజిస్ట్రేషన్ కోసం జ్ఞానభూమి లాగిన్‌లో ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.జయప్రకాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కళాశాల యాజమాన్యం వారి కళాశాలలోని విద్యార్థుల నూతన, రెన్యువల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 30లోగా పూర్తి చేయాలన్నారు. దరఖాస్తు విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత కళాశాలలో లేదా స్థానిక సచివాలయంలో లేదా జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు

సిద్దవటం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మండలంలోని పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, టక్కోలి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని బీసీ కాలనీలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్‌సర్వే, లార్వా సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంటు మలేరియా నివారణ అధికారి జి.వెంకట్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ.సుబ్బరాయుడు, పొన్నవోలు పి.హెచ్.సి వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి, సర్పంచ్ లక్ష్మీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం.. కలవరం



కడపలో కురుస్తున్న వర్షం

- వరి, శనగ రైతుల్లో ఆందోళన
- మూడు రోజులుగా కొనసాగుతున్న వాన
- బద్వేలులో అత్యధికంగా 38.2 మి.మీ



వెన్ను దశలో ఉన్న వరి పంట

కడప అగ్రికల్చర్: ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి ఆరుగాలం కష్టపడి పంటల సాగు చేసుకుంటే.. అకాల వర్షాలు అన్నదాతలను కలవర పెడుతున్నాయి. జిల్లాలో చాలా చోట్ల వరి పంట పొట్ట, వెన్ను, కోత దశలో ఉంది. పలు చోట్ల నూర్పిళ్లు కూడా జరుగుతున్నాయి. అలాగే ఇటీవల చాలా మంది రైతులు శనగ, మినుము, పెసర వంటి ఆరుతడి పంటలు సాగు చేశారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరితోపాటు ఆరుతడి పంటల సాగు చేసిన రైతుల గుండెల్లో గుబులు పట్టుకుంది.

ఖరీఫ్‌లో..

జిల్లాలో ఖరీఫ్‌లో 70,648 ఎకరాల్లో వరి పంట సాగైంది. ముందస్తుగా వేసిన వరి పంట చాలా చోట్ల కోత దశకు చేరుకుంది. ఉన్నట్లుంటి తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కోత కోసి ధాన్యాన్ని ఆరుబెట్టుకున్నారు. ఈ వర్షాలకు పట్టలు కప్పి ఉంచితే వేడి వల్ల గింజ రంగు మారుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చాలా చోట్ల కొద్దిగా ఆలస్యంగా సాగు చేసిన వరి చిరుపొట్ట, గింజ దశలో ఉంది. ఈ వర్షాలకు చిరుపొట్టలోకి నీరు దిగి తెల్ల కంకి వస్తుందని దిగులు చెందుతున్నారు. ఏదిఏమైనా అకాల వర్షం వరి రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

ఆరుతడి పంటలకు నష్టం

ఇటీవల జిల్లాలో 20 వేల హెక్టార్ల దాకా శనగ పంట సాగు చేశారు. ఇప్పటికే చాలా మంది రైతులు సబ్సిడీతో సాగు చేసిన శనగ విత్తనలు సరిగా మొలకెత్తక ఆందోళన చెందుతున్నారు. ఇప్పడేమో ఉన్నట్లుంటి కురుస్తున్న వర్షాలకు పంట దెబ్బతింటుందని వారు దిగులు పడుతున్నారు. వీటిలోపాటు పలు మండలాల్లో పెసర, మినుము పంటలను సాగు చేశారు. ఆ రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. ముందుగా సాగు చేసుకున్న ఆరుతడి పంటలకు మాత్రం కొంత మేలని పలువురు రైతులు తెలిపారు.

బద్వేలులో అత్యధికంగా..

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో మూడు రోజుల నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బద్వేలులో అత్యధికంగా 38.2 మి.మీ వర్షపాతం నమోదైంది. పోరుమామిళ్లలో 30.2, గోపవరం 28.4, కొండాపురం 25.2, జమ్మలమడుగు 23.4, మైలవరం 21.4, వల్లూరు 21.4, ఒంటిమిట్ట, కమలాపురం 17.4, ఎర్రగుంట్ల 16.4, ముద్దనూరు 14.2, వీఎన్‌పల్లి 14, చాపాడు 11.8, చింతకొమ్మదిన్నె, బి.కోడూరు 10.4, చెన్నూరు10.2, వేముల 10, బి.మఠం 9.8, సిద్దవటం 9.2, కలసపాడు 8.6, అట్లూరు 8.2, ఖాజీపేట 4.8, కడప 4.2, తొండూరు 3.2, కాశినాయన 3, దువ్వూరు 2.4, సింహాద్రిపురం 2.2, చక్రాయపేట 1.4, లింగాల, పెద్దముడియం 1.2, రాజుపాళెంలో 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జలదిగ్బంధంలో ఆర్టీసీ బస్టాండ్

కడప కోటిరెడ్డి సర్కిల్: కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం జలదిగ్బంధంలో చిక్కుకుంది. చిన్నపాటి వర్షం వచ్చినా.. ఇక్కడ పెద్ద ఎత్తున నీరు నిలవడం పరిపాటిగా మారింది. మూడు రోజుల నుంచి వస్తున్న వర్షాలకు ఆ ప్రాంతం నీటి మడుగులా తయారైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బస్టాండ్‌లోకి వచ్చిపోయే బస్సులు.. ఈ వర్షపు నీటిలోనే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నీరంతా ఎప్పటికప్పుడు అక్కడి నుంచి వెళ్లేందుకు అధికారులు ఎప్పుడు ప్రయత్నిస్తారోనని ప్రతి సారి ప్రజలు ఎదురు చూడటం తప్ప చేయగలిగిందేమీ లేదు.



కడప ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిల్వ ఉన్న నీరు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీకృష్ణ గీతాశ్రమంలో కోటి దీపోత్సవం



కార్తికం... జ్యోతిర్మయం

కార్తిక పౌర్ణమి సందర్భంగా జిల్లా అంతటా దీపాలు ధగధగలాడాయి. అన్ని శివాలయాల్లో సాయం సంధ్యావేళలలో జ్వాలా తోరణాలు కొత్త వెలుగులు పంచాయి. భక్తుల శివనామ స్మరణతో ఆలయాలన్నీ ప్రతిధ్వనించాయి. అన్ని ఆలయాలతో పాటు ప్రత్యేకంగా అటవీ ప్రాంతాల్లోని శైవక్షేత్రాలు, తీర్థాలలో భక్తులు పోటెత్తారు. వైఎస్సార్ జిల్లాలోని ప్రసిద్ధ శివాలయాలైన పుష్పగిరి, పాలతల మల్లేశ్వరుడు, ఖాజీపేట నాగనాథేశ్వరాలయం, మోపూరు భైరవేశ్వరాలయం, ప్రొద్దుటూరు శివాలయాలు, అల్లాడుపల్లె వీరభద్రస్వామి, అనిమెల సంగమేశ్వరాలయం, భానుకోట, కన్నెతీర్థం లతో పాటు అన్నమయ్య జిల్లాలోని అత్తిరాల, రాయచోటి వీరభద్రస్వామి ఆలయం, నిత్యపూజ కోన తదితర శివాలయాలలో ఆలయ నిర్వాహకులు, కమిటీ ప్రతినిధులు జ్వాలా తోరణం, కోటి దీపారాధన, లక్ష దీపార్చన తదితర పూజలు నిర్వహించారు.
-కడప కల్చరల్



వీరపునాయునిపల్లె : అనిమెల సంగమేశ్వరాలయంలో జ్వాలాతోరణం



వల్లూరు : పుష్పగిరి శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కనుల పండువగా రామయ్య కల్యాణం

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. ముందుగా ఆలయంలోని బాలాలయం ప్రాంగణంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి సీతారాముల ఉత్సవ మూర్తులను ఆశీనులు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు తొడిగి, తులసిపూల గజమాలతో సుందరంగా అలంకరించారు. అలంకరణ అనంతరం ఆలయ అర్చకులు శ్రావణ్ కుమార్, పవన్ కుమార్‌లు సీతారాముల పౌర్ణమి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



కల్యాణోత్సవంలో సీతారాముల ఉత్సవ మూర్తులు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

కడప సెవెన్‌రోడ్స్: పరిశ్రమల స్థాపనతోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూం మీటింగ్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతులు, ప్రోత్సాహక కమిటీ(డీఐఈపీసీ) సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అనుబంధ శాఖల సమన్వయంతో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకురావాలన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ(ఐడీపీ)2023–27 ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరికి చెందిన 3 యూనిట్ల పరిశ్రమలకు ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ కింద రూ.66.55 లక్షలు, రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం చాంద్‌బాషా, ఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, లీడ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ జనార్థన్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీకాంత్ నాయక్, డిక్కీ కో ఆర్డినేటర్ శివశంకర్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

నిబంధనల మేరకే ఉచిత ఇసుక

స్థానిక అవసరాల కోసం ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో ఇసుక ఉచితంగా తీసుకెళ్లవచ్చని, అయితే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు మళ్లిస్తే కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ శ్రీధర్ స్పష్టం చేశారు. మైన్స్ అండ్ జియాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్ కుమార్ మీనా ఇసుకపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ముగిశాక, కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, కడప ఆర్‌డీవో జాన్ ఇర్విన్, గనులు, భూగర్భ శాఖ డీడీ సూర్య చంద్ర రావు, భూగర్భ జల విభాగ అధికారులు, ఇరిగేషన్, పోలీసు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అదివో.. అల్లదివో..

పదకవితా పితామహుడు అన్నమాచార్యుడు. ఆయన కలియుగదైవం వెంకటేశ్వరుడికి చేసిన సంకీర్తనా గానం అమృతమయం. ఆ వాగ్గేయకారుడి కీర్తనలు విశ్వవ్యాప్తం చేయడానికి ఆయన వంశీకులు ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. సంకీర్తన, ఆధ్యాత్మిక, సామాజిక సేవ అంశంగా తీసుకుని ఊరూరా.. అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య అనే నినాదంతో ముందుకువెళుతున్నారు. పలు ఆలయాలలో సంకీర్తనాగానంతో పాటు చిన్నారులకు కోలాట ప్రదర్శనలో శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో ఇంటింటా అన్నమయ్య కార్యక్రమం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా చేపట్టారు.



వైజాగ్‌లో అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలలో భాగంగా ఊరూరా అన్నమయ్య..ఇంటింటా అన్నమయ్యలో సంకీర్తన గానం చేస్తున్న కళాకారులు (ఫైల్)



రాజంపేట: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు విశ్వవ్యాప్తి చేయడానికి అన్నమయ్య వారసులు నడుంబిగించారు. ఈ నేపథ్యంలో 2005 ఆగస్టు 30న శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్‌ను తిరుపతిలో ప్రారంభించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో సంకీర్తనల సేవతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక సేవలను కొనసాగిస్తూ వస్తున్నారు. 12వ తరం అన్నమయ్య వారసులు ఏర్పాటుతో ప్రారంభమైన ఆ సేవ ఇప్పుడు 13వ తరం వారసులు కూడా శుక్రవారం చేపట్టిన కార్యక్రమాలతో ముందుకు తీసుకెళుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో అన్నమయ్య సేవాసంస్కృతి అన్నమాలతో ప్రసిద్ధి చెందింది. ఎన్నో కార్యక్రమాలను నిర్వహించారు.

ఊరూరా అన్నమయ్యలో..

ఊరూరా అన్నమయ్య కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆలయానికి వెళ్లి అక్కడ సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విష్ణుపురాణం, హనుమాన్ చాలీషా, నగర సంకీర్తన తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. అన్నమయ్య పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంకీర్తనలు, కోలాటంలో ఉచితంగా శిక్షణ

అన్నమాచార్య సంకీర్తనలు, కోలాటాలలో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. సామాజిక సేవ, ఆధ్యాత్మిక సేవ, అన్న మయ్య సంకీర్తన ప్రచారసేవ, సాంస్కృతి సేవ, భక్తిసేవ, సంగీత సేవ కార్యక్రమాలతో పాటు పాఠశాలలలో విద్యార్థులకు ఉచితంగా అన్నమయ్య సంకీర్తనలు నేర్పిస్తున్నారు. కోలాటంలో కూడా శిక్షణ ఇస్తున్నారు. భక్తి గాన మంజరి కార్యక్రమాలపై పిల్లలలో అవగాహన కోసం స్తోత్ర మంజరి పై కార్యక్రమాలను నిర్వహించి వరల్డ్ రికార్డ్స్ సాధించారు.

ఏటా అన్నమయ్య ఆరాధనోత్సవాలు

ప్రతి ఏటా అన్నమయ్య ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీటీడీ నిర్వహించే అన్నమయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు అన్నమయ్య 12 వ తరానికి చెందిన హరిస్వామి విధిగా పాల్గొంటున్నారు. ఈ ట్రస్ట్ చైర్మన్‌గా తాళ్లపాక రామ్‌చరణ్, వైస్‌చైర్మన్‌గా తాళ్లపాక కృష్ణధీరజ్, సెక్రటరీగా తాళ్లపాక గౌరీ ప్రసన్న, ఉభయ రాష్ట్రాల డైరక్టర్లుగా కొఠారి సునీత, మీనాక్షి అన్నమయ్య వ్యవహరిస్తున్నారు.

సామాజికసేవలోనూ..

ప్రతి సంవత్సరం మార్చి నుంచి జూన్ వరకు వేసవిలో విశాఖ, కర్నూలు నగరాలలో భక్తులకు దాహం తీర్చేందుకు మంచినీళ్లు, మజ్జిగ వితరణ కేంద్రాలను ఏర్పాటుచేసి అన్నమయ్య సేవను అందిస్తున్నారు. అలాగే పల్స్‌పోలియో, మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం కొనసాగుతోంది.

అన్నమయ్య జన్మస్థలిలో ..

కార్తీక పౌర్ణమి రోజున తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో ఊరూర అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భక్తులను అన్నమయ్య వారసులు కోరుతున్నారు.

ఊరూరా అన్నమయ్యకు విశేష స్పందన



ఊరూరా అన్నమయ్య...ఇంటింటా అన్నమయ్య కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో అన్నమాచార్యుని సంకీర్తనల వ్యాప్తి, శిక్షణ, ఆధ్యాత్మిక సేవ, సామాజిక సేవలను నిర్వహిస్తున్నాం. భక్తి,సేవపరంగా అన్నమయ్య చూపిన మార్గంలో మేము ముందుకెళుతున్నాం.
– మీనాక్షి అన్నమయ్య, డైరక్టరు, తెలంగాణా అన్నమయ్య సేవాసంస్కృతి

అన్నమయ్య సంకీర్తనలకు విస్తృత ప్రచారం



తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలకు విస్తృతప్రచారం నిర్వహిస్తున్నాం. ఊరూర అన్నమయ్య..ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాలను ఏపీ, తెలంగాణాలో దిగ్విజయంగా నిర్వహిస్తున్నామంటే భక్తుల సహకారం ఎంతో ఉంది. టీటీడీ సహకారం అన్నమయ్య వారసులకు ఉండటం వల్ల మేము ఆధ్యాత్మికసేవను ముందుకు తీసుకెళుతున్నాం.
– తాళ్లపాక గౌరీ ప్రసన్న, ట్రస్ట్ సెక్రటరీ, తిరుమల

అన్నమాచార్యుల సంకీర్తనలు విశ్వవ్యాప్తం చేస్తాం

- అన్నమయ్య వంశీకుడు తాళ్లపాక హరినారాయణస్వామి



తాళ్లపాకలో మాట్లాడుతున్న అన్నమయ్య వంశీకుడు తాళ్లపాక హరినారాయణచార్యులు

రాజంపేట: తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలను విశ్వవ్యాప్తం చేయడానికే ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని అన్నమయ్య వంశీకుల తరఫున నిర్వహిస్తూ వస్తున్నామని అన్నమాచార్య 12వ తరానికి చెందిన వంశీకుడు తాళ్లపాక హరినారాయణస్వామి (తిరుమల) అన్నారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలో ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగురాష్ట్రాలలో సంకీర్తనల సేవతో పాటు ఆధ్యాత్మిక, సామాజికసేవలను కొనసాగిస్తూ వస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య సేవా ట్రస్ట్ చైర్మన్ తాళ్లపాక రామ్‌చరణ్, వైస్‌చైర్మన్ తాళ్లపాక కృష్ణధీరజ్, సెక్రటరీ తాళ్లపాక గౌరీ ప్రసన్న, ఉభయరాష్ట్రాల డైరక్టర్లుగా కొఠారి సునీత, మీనాక్షి అన్నమయ్యతో పాటు తాళ్లపాకకు చెందిన జవ్వాది అదృష్టదీపుడు, శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ సిబ్బంది, అన్నమాచార్య కళాకారులు పాల్గొన్నారు.

108 అడుగుల అన్నమయ్య విగ్రహం వరకు..

ఊరూరా అన్నమయ్య.. ఇంటింటా అన్నమయ్య కార్యక్రమాన్ని తాళ్లపాక గ్రామ శివార్లలోని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ నుంచి హైవేలోని 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వరకు వైభవోపేతంగా నిర్వహించారు. దారిపొడవునా మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అన్నమయ్య సంకీర్తనలు మారుమోగాయి.

క్లుప్తంగా

వాటర్ ట్యాంక్‌లో విషం కలిపిన వ్యక్తిపై కేసు

చాపాడు : మండల పరిధిలోని ఎస్.ఓబాయపల్లె గ్రామానికి చెందిన అయ్యవారురెడ్డి అనే వ్యక్తిపై వాటర్ ట్యాంక్‌లో విషం కలిపాడని శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. గ్రామానికి చెందిన నందిమండలం శంకర్‌రెడ్డి ఇంటిపై నుంచి గురువారం అర్ధరాత్రి ఇదే గ్రామానికి చెందిన అయ్యవారురెడ్డి కిందకు దిగి పోవడాన్ని గుర్తించారు. దీంతో మిద్దె పైకి వెళ్లి చూడగా వాటర్ ట్యాంక్ తెరచి ఉండటంతో అందులో పరిశీలించగా విషం కలిపినట్లు గుర్తించారు. బాధితుడు శంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు అయ్యవారురెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

భార్యను కత్తితో పొడిచిన భర్త



కత్తిపోటుతో గాయపడిన సుబ్బలక్షుమ్మ

కాశినాయన : మండలంలోని బాలరాజుపల్లె గ్రామానికి చెందిన బసిరెడ్డిరామిరెడ్డి తన భార్య సుబ్బలక్షుమ్మను శుక్రవారం కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు, వారి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మద్యానికి బానిసైన రామిరెడ్డి ప్రతినిత్యం భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈ తరుణంలోనే మద్యానికి డబ్బులు ఇవ్వాలని భార్యతో గొడవపడి డబ్బులు ఇవ్వలేదని కత్తితో తీవ్రంగా గాయపరిచాడు. ఎస్ఐ హనుమంతు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆమెను వెంటనే పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాయలసీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు

- శ్రీబాగ్ ఒడంబడిక, పెద్ద మనుషుల ఒప్పందం ఉల్లంఘన
- ఆనాడు రాష్ట్రం కోసం కర్నూలు రాజధానిని త్యాగం చేశాం
- నేడు అదే తరహాలో మోసం చేస్తున్న బాబు
- వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాయలసీమకు న్యాయంగా దక్కాల్సినవి కూడా దక్కకుండా చేస్తారని, ఇప్పుడు కూడా సీమకు ద్రోహం చేసేందుకు సిద్ధపడ్డారని వైఎస్సార్ సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. కడపలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమకు అనాది నుంచీ అన్యాయమే జరుగుతోందన్నారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాయలసీమలో హైకోర్టు పెట్టాలన్నారు, కానీ పెట్టలేదన్నారు. సాగునీరు, తాగునీరు, పరిశ్రమలతో పాటు అభివృద్ధి పరంగా రాయలసీమకు ప్రతిసారీ అన్యాయమే జరిగిందన్నారు. అందరూ విస్మరించినా వైయస్సార్, జగన్ హయాంలో మేలు జరిగిందన్నారు. 2014–19 మధ్య కాలంలో హైకోర్టు కోసం న్యాయవాదులతో పాటు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలని తలంచి కర్నూలును న్యాయరాజధానిగా అభివృద్ధి చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగా హెచ్ఆర్‌సీ, ఏపీఈఆర్‌సీ, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టులను కర్నూలులో ఏర్పాటు చేశారన్నారు. రెండో నేషనల్ లా యూనివర్సిటీని కూడా కర్నూలులో పెట్టాలని భావించి, భూములు కేటాయించడంతో పాటు రూ.100కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాన్ని కూడా తరలించుకుపోయారన్నారు. కొప్పర్తిలోని ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించారని, తాజాగా కర్నూలులోని హెచ్ఆర్‌సీ, ఏపీఈఆర్‌సీ, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టులను కూడా తరలించడం దుర్మార్గమన్నారు. రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం, సీపీఐ నేతలు నోరు తెరవాలన్నారు. ఈ అన్యాయాన్ని వైఎస్సార్‌సీపీ సహించదని, కలిసొచ్చే పార్టీలతో కలిసి రాయలసీమ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

డైవర్షన్ పాలిటిక్స్ :
సోషల్ మీడియా కేసుల్లో ఏ వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అన్యాయం జరిగినా తాము అండగా నిలుస్తామని, డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఇలా కేసులు పెడుతున్నారని రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ వారిపై పెట్టిన అసభ్య పోస్టులపై మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచిన వారిపై దాడులు చేస్తూ, హత్యలు చేస్తున్నారన్నారు. అధికారం శాశ్వతం కాదని, ఇంతకు పది రెట్లు అనుభవించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్ కుమార్, పాకా సురేష్ కుమార్, బీహెచ్ ఇలియాస్, కరీముల్లా, రామక్రిష్ణారెడ్డి, దేవిరెడ్డి ఆదిత్య, మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఏఐఎస్‌టీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్



మాట్లాడుతున్న సదానందగౌడ్

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు అమలు చేస్తున్న సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆల్ ఇండియా సెంకడరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌టీఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం కడపలోని వీణ విజయరామరాజు ఎస్టీయూ భవన్‌లో ఆయన ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపుగా లక్షలాది కుటుంబాలు సీపీఎస్‌తో ఇబ్బంది పడుతున్నాయన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాలు సీపీఎస్‌ను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకున్నాయని, దేశవ్యాప్తంగా ఈ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. పెన్షన్ ఉద్యోగి హక్కుగా భావించి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం వారంలోగా సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చినా కూడా అది అమలు కాకపోవడం బాధాకరం అన్నారు. మాకు పాత పెన్షన్ విధానం తప్ప ఏ పెన్షన్ విధానం అంగీకారం కాదని తెలిపారు. అలాగే సీపీఎస్ ఉద్యోగి చెల్లిస్తున్న కాంట్రిబ్యూషన్, మ్యాచింగ్ గ్రాంట్స్ ఉద్యోగి ఖాతాలో ప్రతినెలా జమ అయ్యేటట్లుగా చూడాలన్నారు. రిటైర్ అయిన పెన్షనర్ కమ్యూటేషన్ విలువ తగ్గించారన్నారు. రిస్టోర్ సమయాన్ని 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు సురేష్ బాబు, బాల గంగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు ఎస్.ఎం.డి ఇలియాస్ బాషా, రాష్ట్ర మునిసిపల్ కన్వీనర్ రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకట సుబ్బయ్య, సనావుల్లా భాస్కర్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

18న ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా



మాట్లాడుతున్న పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈపీఎస్ 95 పెన్షన్ దార్ల సమస్యలపై పీఎఫ్ కార్యాలయం ఎదుట ఈ నెల 18న ధర్నా చేపడుతున్నట్లు పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ. 9వేలు, డీఏ చెల్లించాలన్నారు. హయ్యర్ పెన్షన్ అందరికి ఇవ్వాలని, ఈపీఎస్ పెన్షనర్లకు ఉచితంగా ఆరోగ్య శ్రీ పథకాన్ని అమలు చేయాలన్నారు. సీనియర్ సిటిజన్స్ అందరికీ రైలు ప్రయాణాల్లో రాయితీని తిరిగి కొనసాగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న హయ్యర్ పెన్షన్ దరఖాస్తులు పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. దేశవ్యాప్తంగా 35 లక్షల మందికి కేవలం రూ. 1000 మాత్రమే చెల్లిస్తున్నారు. గత పదేళ్ల నుంచి కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని అఖిలభారత స్థాయిలో పెన్షన్ సంఘాలు ఢిల్లీలో ఆందోళన చేసినా ఈ ప్రభుత్వాల్లో ఎలాంటి చలనం లేదన్నారు. కార్యక్రమంలో హరిచంద్ర రెడ్డి, రామకష్ణారెడ్డి నారాయణ రెడ్డి, సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు, విషప్రచారాలు

వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం



ఖాజీపేట : నాడు ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలో కూటమి నేతలంతా ఊరు, వాడ, పట్టణం, నగరం తిరిగి వైఎస్ జగన్ సర్కార్‌పై విషయం చిమ్మి గ్లోబెల్స్ ప్రచారం చేసి రాజకీయంగా లబ్ధిపొందారు. నేడు అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు, విష ప్రచారాలు బట్టబయలు అయ్యాయని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలకు కూటమి నేతలంతా బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.శుక్రవారం ఖాజీపేట మండలం దుంపలగట్టులో రెడ్యం విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్‌ల అమలును మరుగున పరిచేందుకు, అమలు పరచకుండా ప్రజల్ని పక్కదారి పట్టించేందుకు ఇప్పటికీ నాటి ప్రభుత్వ అప్పులపై దుష్ప్రచారం చేయడం టీడీపీ నేతలకే చెల్లిందని ఎద్దేవా చేశారు. కూటమి వాగ్దానాలు బారెడు–నిధులు మూరెడని, ఆ నిధులతో వాటిని ఎలా అమలుపరుస్తారని సూటిగా ప్రశ్నించారు.

విద్యారంగ సమస్యలపై 18న మహాధర్నా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలు బడ్జెట్‌లో కేటాయించాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 18న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి ఎద్దు రాహుల్, వీరిపోగు రవి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాదీవెన, వసతిదీవన బకాయిలు రూ.3,480కోట్ల విడుదలకు ప్రభుత్వం తాత్సర్యం చేస్తుందన్నారు. ఇప్పటికే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పలుమార్లు విన్నవించిన ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాలలో బడ్జెట్ కేటాయింపులలో పెండింగ్ బకాయిల గురించి మాట్లాడకపోవడం హేయమైనచర్య అన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించలేక పడరాని పాట్లు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో 84 లక్షల మంది విద్యార్థులకు రూ.12,600 కోట్లు అవసరం కాగా, రూ.5,387.03 కోట్లే మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారన్నారు. దీనితో తల్లికి వందనంపై కూడా అనుమానాలు పెరిగాయనన్నారు. జీఓ నెం:77ను అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రద్దు చేస్తామని చెప్పి వాటి ఊసెత్తడంలేదన్నారు. ఎంతో అర్భాటంగా తీసుకొచ్చిన డిగ్రీ హానర్స్ విధానం విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని గత ప్రభుత్వం రద్దు చేసిందని వెంటనే పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐజిల్లా సహాయ కార్యదర్శి అజయ్, నాయకులు జెర్మియా, యశ్వంత్, చక్రవర్తి, గిరి పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆశీర్వాదం(ఫైల్)

వేంపల్లె : వేంపల్లెలోని క్రిస్టియన్ కాలనీకి చెందిన గూడూరు ఆశీర్వాదం(58)అనే రైతు అప్పుల బాధతో గుళికల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు. శుక్రవారం మృతుడి భార్య జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. ఆశీర్వాదం గత 20 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అప్పులు చేసి పంటలు సాగుచేసినా పెట్టుబడుల మేర కూడా దిగుబడి రాకపోవడంతో ప్రతి యేడాది నష్టాలు చవిచూస్తున్నాడు. దీంతో సుమారు రు.3లక్షల మేర అప్పులు చేశాడన్నారు. వాటిని తీర్చలేక జీవితంపై విరక్తి చెంది పొలం వద్ద గుళికల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో కడప విమానాశ్రయం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మణ్ అనే వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు అయ్యప్ప మాల ధరించిన లక్ష్మణ్ పని మీదు కడప పట్టణానికి వెళ్లి తిరిగి బైక్‌పై కమలాపురం వైపునకు ప్రయాణిస్తుండగా విమానాశ్రయం సమీపంలో కుక్క అడ్డు వచ్చింది. దీంతో అదుపు తప్పి కిందపడి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.


గురుకుల జూనియర్ కళాశాలలో పాము కలకలం



కెమిస్ట్రి ల్యాబ్‌లో పాము

కొండాపురం : మండల పరిధిలోని అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో శుక్రవారం కెమిస్ట్రి ల్యాబ్‌లో పాము కనిపించడంతో విద్యార్థునులు భయంతో పరుగులు పెట్టారు. ఈనెల 4వ తేదీన రాత్రి బాలికల వసతి గృహంలో నిద్రిస్తున్న ఇద్దరు విద్యార్థునులను పాము కాటువేసిన సంఘటన మరవకముందే తాజాగా కళాశాలలో పాము మరోసారి కనిపించడంతో విద్యార్థునులు ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బంది పామును చంపడంతో ఊపిరి పిల్చుకున్నారు. కళాశాల కొండ ప్రాంతంలో ఉండటంతో విషపురుగులు సంచరిస్తున్నాయి. పాఠశాల పరిసర ప్రాంతాలల్లో శుభ్రంగా ఉంచినా వర్షాలు పడటంతో పాము వచ్చి ఉండవచ్చిని ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి తెలిపారు.


రైలు కింద పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు



రైలు కింద పడి గాయపడిన రామసుధ

బద్వేలు అర్బన్ : అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గంలోని శెట్టిగుంట సమీపంలో రైలు కింద పడి విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. బద్వేలు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన బిజివేముల జయరామిరెడ్డి, ఆదిలక్షుమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కాగా రెండవ కుమార్తె బిజివేముల రామసుధ (20) తిరుపతిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతోంది. తిరుపతి నుంచి స్వగ్రామానికి వచ్చేందుకు రైలులో వస్తున్న రామసుధ శెట్టిగుంట సమీపంలో రైలు కింద పడి గాయాలపాలైనట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. రైల్వేకోడూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రామసుధ పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. అయితే రామసుధ ప్రమాదవశాత్తు రైలు నుండి కింద పడిందా లేక మరేదైనా కారణం ఉందా అన్న విషయం తెలియాల్సి ఉంది.

లారీకింద బయట పడిన మృతదేహం



మృతుని ఆధార్ కార్డు

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : రాయచోటి–కడప మార్గంలోని గువ్వల చెరువు ఘాట్‌లో బోల్తా పడిన లారీ కింద మృతదేహం లభ్యమైంది. గురువారం తెల్లవారు జామున బ్యాటరీ లోడుతో రాయచోటి వైపు నుంచి కడప వైపునకు వస్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. అయితే ఈ ఘటనలో సురక్షితంగా బయటపడిన వ్యక్తి తాను క్లీనర్‌నని చెప్పాడు. మరో వ్యక్తి లారీలో ఉన్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. శుక్రవారం బ్యాటరీలన్నీ తొలగించి లారీని బయటకు తీయగా లారీ కింద మృతదేహం లభ్యం అయింది. ఇతను యూపీకి చెందిన అతుల్ కుమార్ తివారీగా ఆధార్ కార్డును చూసి గుర్తించారు. లారీ ఎక్కడి నుంచి ఎక్కడి పోతుంది.. తదితర వివరాలన్నీ పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన శుక్రవారం బి.కొత్తకోట మండలంలో జరిగింది. పోకనాటివారిపల్లెకు చెందిన శేఖర్‌రెడ్డి భార్య అరుణ (31) కుటుంబ సమస్యల కారణంగా మనస్థాపం చెందిన పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే బాధితు రాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పొలాలకెళ్లే రస్తా మధ్యలో కాలువ తీస్తే ఎలా ?



రైతులు వెళ్లే రస్తా మధ్యలో తీసిన కాలువ

చాపాడు : ఇరువురు రైతుల మధ్య ఏర్పడిన సమస్య 100 ఎకరాల సాగు భూములకు చెందిన రైతులందరికీ సమస్యగా మారింది. సాగునీటి కోసమని ఏళ్ల తరబడి రైతులందరూ వెళ్లే పంట పొలాల రస్తా మధ్యలో పంట కాలువ తీయించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు అధికారులందరూ సమస్యను పరిశీలించినప్పటికీ పరిష్కారం కాకపోవటంతో రస్తాలోనే జేసీబీతో కాలువ తీశారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తి కోసమని దారి మధ్యలో పంట కాలువ తీస్తే పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు ఎలా చేసుకోవాలని మిగిలిన రైతులందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా..

మండల పరిధిలోని నరహరిపురం క్రాస్ రోడ్డు వద్ద గల బ్రిటీషు మోరీ నుంచి పంట పొలాల్లోకి వెళ్లే రస్తా మధ్యలో గురువారం రాత్రి జేసీబీతో కాలువను తీశారు. గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి అనే రైతు 80 సెంట్ల పొలంలో సాగు చేసుకున్న పంటకు సాగునీటి సమస్య తలెత్తింది. దీంతో పంట కాలువ ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. తహసీల్దారు రమాకుమారి, కేసీ కెనాల్ జేసీ గురుమోహన్‌రెడ్డి సమస్యను పరిశీలించారు. కాలువ నుంచి సాగునీరు తీసుకెళ్లేందుకు దారి ఇరువైపులా పట్టా భూములు కావటంతో తమ పొలాల్లో కాలువ తీసేందుకు సంబంధిత రైతులు ఒప్పుకోలేదు. అధికారులు సమస్యను పరిష్కరించలేక పోలీసుల బందోబస్తుతో జేసీబీ చేత కాలువ తీయించారు.

ఇసుక క్వారీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి



గొల్లపల్లి ఇసుక క్వారీ వద్ద కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గొల్లపల్లి ఇసుక క్వారీ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కడప జిల్లా జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్ ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని గొల్లపల్లి ఇసుక క్వారీని ఆమె పరిశీలించి మండల రెవెన్యూ అధికారులు, ఇసుక క్వారీ కాంట్రాక్టరు, గ్రామస్తులతో ఇసుక రవాణాకు ఎదరువుతున్న సమస్యలపై చర్చించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ఇసుక రవాణాకు పెట్టిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అలాగే ఇసుక క్వారీలో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఎప్పటికప్పుడు అధికారులకు తెలిసేలా సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. జేసీ వెంట గనులశాఖ కడప జిల్లా డిప్యూటీ డైరెక్టర్ సూర్య, ఒంటిమిట్ట తహసీల్దార్ రమణమ్మ, మండల రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గండిలో ముగిసిన పవిత్రోత్సవాలు



మహా పూర్ణాహుతితో ఉత్సవాలను ముగిస్తున్న పురోహితులు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో నాలుగు రోజులుగా సాగుతున్న పవి త్రోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం త్రికాల ఆరాధన, పంచ సూక్త హోమం, మన్యుసూక్త హోమం, ఆంజనేయస్వామి మూలమంత్ర హోమం, పవిత్ర విసర్జన, సోమకుంభ ఉద్వాసన, మహాపూర్ణాహుతి, మహా కుంభ ప్రోక్షణనివేదన, శాత్తుమొర్రై, తీర్థ ప్రాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పర్యవేక్షణలో ప్రధాన, ఉపప్రధాన, ముఖ్య అర్చకులు కేసరి, రాజారమేష్, రాజగోపాలాచార్యులు, వేదపారాయణ దారు రామమోహన్ శర్మ, టీటీడీ యాజ్ఞకులు ఈవేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, భక్తులు పాల్గొన్నారు.

పెన్నానదిలో యువకుడి గల్లంతు

నీటిలో మునుగుతున్న బాలుడిని కాపాడబోయి గల్లంతైనన వైనం



నీటిలో గల్లంతైన గణేష్ (ఫైల్)



రోదిస్తున్న భార్య, కుటుంబ సభ్యులు



మర బోట్ల సహాయంతో గాలింపు చర్యలు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో కార్తిక పౌర్ణమిరోజు అపశృతి చోటు చేసుకుంది. నీటిలో మునుగుతున్న బాలుడిన కాపాడబోయి రెడ్డిపల్లె గణేష్ (27) అనే యువకుడు పెన్నానది నీటిలో గల్లంతయ్యాడు. వివరాలిలా.. కడప పట్టణంలోని ఎన్‌జీవో కాలనీకి చెందిన గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని దైవ దర్శనం కోసం శుక్రవారం పుష్పగిరికి వచ్చాడు. నదిలో స్నానాలు చేసే క్రమంలో అతడు పెన్నానది ఒడ్డున నిలబడి ఉన్నాడు. ఆ సమయంలో కడప పట్టణంలోని శంకరాపురానికి చెందిన కుటుంబ సభ్యులు తమ కుమారుడు లోకేష్‌తో కలిసి నీటిలో స్నానాలకు దిగారు. సాన్నం చేస్తూ లోకేష్ నీటిలో మునిగిపోతున్నాడు. అది గమనిచిన గణేష్ తనకు ఈత వచ్చునని చెబుతూ ఆ బాలుడిని రక్షించడానికి నీటిలోకి దిగాడు. నీటిలో పవాహం ఎక్కువగా ఉన్న కారణంగా అతడు కూడా నాటిలో మునిగాడు. అదే సమయంలో అక్కడే ఉన్న స్థానిక యువకుడు గమనించి లోకేష్‌ను సురక్షితంగా బయటకు లాగాడు. గణేష్‌ను రక్షించడానికి ప్రయత్నించినప్పటికీ అప్పటికే అతడు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో పాటు రెస్క్యూ టీమ్ ద్వారా రబ్బరు బోట్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు.

తల్లిదండ్రులు, భార్య ఎదురు చూపు:
కాగా గణేష్‌కు సుమారు మూడు నెలల క్రితం వివాహమైనట్లు తెలుస్తోంది. అతడు తన తల్లిదండ్రులతో పాటు భార్య శ్రావణితో కలిసి పుష్పగిరికి వచ్చారు. వారి కళ్లెదుటే అతడు నీటిలో గల్లంతయ్యాడు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా అతడు దొరుకుతాడని ఎదురు చూస్తున్నారు. ఉదయం నుంచి ఏమీ తినకుండా తీవ్రంగా రోదిస్తున్న శ్రావణి ఏదైనా కొద్దిగా తినాలని బంధువులు బతిబలాడారు. తన భర్త వచ్చిన తరువాత ఇద్దరం కలిసి తింటామని ఆమె రోదించడంతో అక్కడ ఉన్న వారందరూ కంట తడి పెట్టారు.

ప్రమాద హెచ్చరికలు ఏవీ?
కార్తిక సోమవారాలతో పాటు పౌర్ణమి రోజు పుష్పగిరికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వస్తారని తెలిసినప్పటికీ అక్కడ ఎటువంటి భద్రతా చర్యలను దేవదాయశాఖ అధికారులు చేపట్టలేదు. నదిలో నీటి ప్రవాహం కారణంగా భారీ మడుగు ఉంటుందని , ప్రమాకరమని తెలిపే సూచిక బోర్డులు అక్కడ ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. దేవదాయ శాఖ అధికారులు కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.